విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదులో జాప్యం

- నత్తనడకన నమోదు ప్రక్రియ
- ఈనెల 7 వరకు గడువు
- పథకాల ప్రయోజనం పొందేందుకు ఈ సంఖ్య అవసరమంటున్న అధికారులు


గణపవరంలో రైతుల వివరాల నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

గణపవరం: రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం నత్త నడకన సాగుతోంది. సాగుభూమి ఉన్న ప్రతి రైతుకూ 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య పత్రం (కార్డు) జారీ చేసే ప్రక్రియను వ్యవసాయశాఖ అధికారులు చేపట్టారు. భవిష్యత్తులో వివిధ సంక్షేమ పథకాల అమలుకు ఈ విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుంది. ప్రస్తుతం ఉంగుటూరు నియోజకవర్గంలోని రైతు సేవా కేంద్రాల్లో పార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది.

పీఎం కిసాన్ రైతుల నమోదు పూర్తి

ఇప్పటివరకూ ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పీఎం కిసాన్ పథకంలో లబ్ధి పొందుతున్న రైతుల నమోదు ప్రక్రియ పూర్తయిందని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. అయితే పీఎం కిసాన్ పథకం వర్తించని భూయజమానుల గుర్తింపు ప్రక్రియ మాత్రం నెమ్మదిగా సాగుతోంది. ఆయా గ్రామాల్లో భూయజమానులను గుర్తించి వారిని రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకునేలా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులను సమాయుత్తం చేస్తున్నారు. ఈనెల 7వ తేదీకి ఈప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే రెండు పర్యాయాలు నమోదు గడువును ప్రభుత్వం పెంచింది.

ఉంగుటూరు నియోజకవర్గంలో నమోదు వివరాలు

మండలం	విస్తీర్ణం	నమోదైన రైతులు
గణపవరం	11,750	6,500
నిడమర్రు	3,466	2,724
ఉంగుటూరు	24,350	9,242
భీమడోలు	12,750	4,684

అవసరమైన ధ్రువపత్రాలు

రైతు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జెరాక్స్ కాపీ, ఒన్‌బీ, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళితే అక్కడ ఉన్న సిబ్బంది ప్రభుత్వం ప్రవేశపెట్టిన వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసి, రైతు ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబరుకు మూడు సార్లు ఓటీపీలు పంపిస్తారు. ఆ ఓటీపీలను వ్యవసాయ సిబ్బంది వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే రైతుకు విశిష్ట గుర్తింపు ప్రక్రియ దరఖాస్తు పూర్తయి రైతు ఫోన్ నంబర్‌కు 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఎస్ఎంఎస్ ద్వారా వస్తుంది. దీనితో ప్రక్రియ పూర్తవుతుంది.

ప్రయోజనాలు ఇవీ..

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ 14 అంకెల సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుంది. పీఎంకిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మపోషకాలు సూక్ష్మ సేద్యంపై రాయితీలు, పంట రుణాలు, పెట్టుబడి సాయం, తదితర ప్రభుత్వ పథకాలను రైతులు నేరుగా పొందే అవకాశం కలుగుతుంది. నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి సేవలు అందుకోవడానికి ఉపయోగపడుతుంది. వరి, జొన్న, మొక్కజొన్న, పసుపు, అరటి, మినుముతోపాటు, కూరగాయలు, ఇతరత్రా ఏ పంటలైనా సాగుచేసే రైతులు కనీసం ఒక్క సెంటు వ్యవసాయ భూమి ఉన్న వారందరికీ ఐడీ నంబరు అవసరం.

నమోదు ప్రక్రియ వేగవంతం

సొంత భూమి కలిగిన రైతులంతా రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 7లోగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలి. ఇప్పటి వరకూ పీఎం కిసాన్ పథకంలో లబ్ధిదారులందరినీ నమోదు పూర్తిచేశాం. ఇంకా పీఎం కిసాన్ పథకంలో అర్హులుకాని రైతుల నమోదు ప్రక్రియ వేగంగా సాగుతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం వ్యవసాయ భూమి కలిగిన రైతులను 14 అంకెల ప్రత్యేక నంబరు కోసం నమోదు చేసేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు.

– ఉషారాజకుమారి, ఏడీఏ, భీమడోలు

దళిత ఉన్నతాధికారులను వేధించడం తగదు


మాట్లాడుతున్న దళిత సంఘాల నేతలు

దెందులూరు: దళితులైన ఉన్నతాధికారులను కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయడం మంచి సంప్రదాయం కాదని రాష్ట్ర దళిత నాయకులు అన్నారు. సోమవారం రాష్ట్ర నాయకులు పల్లెం ప్రసాద్ నివాసంలో నిర్వహించిన దళిత నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊ దరగొండ చంద్రమౌళి, పళ్లెం ప్రసాద్, మెండెం సంతోష్ కుమార్ మాట్లాడారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అధికారులను శాఖా పరంగా ఇబ్బందులు గురిచేయడాన్ని వారు తప్పుపట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులకు, ప్రజలకు వారధిగా సేవలందిస్తారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేవలం దళిత ఉన్నతాధికారులను లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులు పెట్టడం సరి కాదన్నారు. తప్పు జరిగితే విచారణ చేసి నిర్ధారణ అనంతరం చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు తామంతా అండగా ఉంటామని, దళిత అధికారులు ధైర్యంగా ఉండాలని, న్యాయం ఎప్పటికీ గెలుస్తుందని వారన్నారు. గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, వార్డు మెంబర్ శ్రీధర్ ఉన్నారు.

క్లుప్తంగా

గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిగా కిరణ్మయి


గణపవరం పీహెచ్‌సీలో బాధ్యతలు తీసుకుంటున్న కిరణ్మయి

గణపవరం: గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలతో డాక్టర్ పి.కిరణ్మయి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ వైద్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పులపర్తి సంతోష్ ఉన్నత విద్య నిమిత్తం వెళ్లడంతో కిరణ్మయిని పూర్తి బాధ్యతలతో వైద్యాధికారిగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీ అభివృద్ధికి, రోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాఖాధికారికి ఘన సత్కారం


లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: బదిలీపై వెళ్లిన ఉంగుటూరు మండల విద్యాశాఖాధికార్లు లక్ష్మీనారాయణ, భాస్కర్‌కుమార్‌ను సోమవారం విద్యావనరుల కార్యాలయంలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారిణి–1 నిమ్మగడ్డ రవీంద్రభారతి, అల్లు శ్రీను, టి.శ్రీధర్, మందపాటి శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర


భీమడోలులో అమ్మవార్ల ఘటాలను ఎత్తుకుని గ్రామసంచారం చేస్తున్న గణాచారులు

భీమడోలు: భీమడోలులో గ్రామదేవతలుగా పూజలందుకుంటున్న మద్దిరామమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజు జాతర ఘనంగా కొనసాగుతోంది. ఈనెల 9న ముగింపు సందర్భంగా సోమవారం గణాచారులు పలు ఏరియాల్లో గ్రామసంచారం చేసారు. అమ్మవారి ఘటాలను నెత్తిన పెట్టుకుని వారు గ్రామోత్సవాన్ని కొనసాగించారు. సంతమార్కెట్, లక్ష్మయ్య మిల్లు వెనుక ఏరియాల్లో సంచారం చేసారు. ఇంటింటికీ వెళ్లిన గణాచారులకు భక్తులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు.

వినికిడి లోపం ఉన్న పిల్లలకు ప్రత్యేక విద్య


మాట్లాడుతున్న ఏడీ రామ్ కుమార్

ఏలూరు (టూటౌన్): స్థానిక దొండపాడు పరివర్తన్ బధిరుల పాఠశాలలో ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. మారుతున్న మనస్తత్వాలు, చెవి, వినికిడి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ 25 ఏళ్లుగా వినికిడి లోపం ఉన్న పిల్లలకి ప్రత్యేక విద్య అందించడంతో పాటు వారు ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు.

రేపు విజయవాడలో మహాధర్నా

ఏలూరు (టూటౌన్): ఆప్కాస్ రద్దును వ్యతిరేకిస్తూ, ఆప్కాస్ కార్మికుల పర్మినెంట్ కోరుతూ ఈనెల 5న విజయవాడలో మున్సిపల్ కార్మికుల మహాధర్నా నిర్వహించనున్నట్టు ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య సోమవారం తెలిపారు. మహాధర్నాలో ఏలూరు జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి మున్సిపాలిటీలకు చెందిన కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో కొలువై భక్తుల పూజలందుకుంటున్న భూలక్ష్మీదేవి ఆలయ 50వ వార్షికోత్సవ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కలశ స్థాపన, అఖండ దీపారాధన, కుంకుమ పూజలను అర్చకులు త్రినాథశర్మ నిర్వహించారు. కాగా ఈ ఉత్సవాలు ఆరో తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు ముప్పిడి సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు వీణం వీరన్న


గణపవరంలో వీణం వీరన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న రైతు నాయకులు

గణపవరం: రాష్ట్రంలో ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల రైతులకు ఎనలేని సేవలందించి వారి హృదయాల్లో కొలువైన తొలి తెలుగు ఇంజనీరు వీణం వీరన్న రైతు బాంధవుడని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం వీణం వీరన్న 231వ జయంతి సందర్భంగా గణపవరంలో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు కార్యాచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీఎస్ రాజు మాట్లాడుతూ సర్ ఆర్థర్ కాటన్‌కు కుడిభుజంగా ఉన్న వీరన్న తొలి తెలుగు ఇంజనీరు అని తెలిపారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన వీరన్న నీటిపారుదల శాఖలో ఉద్యోగిగా పనిచేసి, కాటన్‌దొరకు సహాయకుడిగా ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణంలో విశేష సేవలందించిన వీరన్న రైతుల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. రైతులు, నాయకులు పాల్గొన్నారు.

దాతల సేవ భావితరాలకు స్ఫూర్తి


కళావేదికను ప్రారంభిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

దెందులూరు: దాతల సామాజ సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జునరావు, గ్రంథాలయాధికారి గొల్లపూడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు దాతలు ఆకుల నరసింహారావు ఉమాలక్ష్మి ట్రస్ట్ అందించిన రూ.1.50 లక్షలతో నిర్మించిన కళావేదికను ఆయన కుమారుడు ఆకుల వెంకట నరసింహ ప్రసాద్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా దాత కుమారుడు ప్రసాద్ మాట్లాడుతూ తమ తండ్రి, తల్లి విద్యాభివృద్ధికి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇచ్చారని వారి ఆశయాలను సోదరుడు శ్రీధర్‌తో కలిసి కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తో పాటు బెంచీలు ఇచ్చారు. తెలుగు పండిట్ డాక్టర్ సాయిరాం, ఉపాధ్యాయులు దాతలను అభినందించారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం


ఇంటర్ విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపుతున్న దృశ్యం


నారాయణపురంలో పరీక్ష గది వివరాలు చూసుకుంటున్న విద్యార్థినులు

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం తెలుగు పరీక్షా జరిగింది. పరీక్ష కేంద్రానికి లోపలకి వెళ్లే సమయంలో విద్యార్థులందరినీ తనిఖీ చేశారు. మొత్తం 112 మందికి 107 మంది పరీక్షకు హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

కొల్లేరు గ్రామాల్లో దాహం కేకలు


మోటార్లతో చెరువులోకి నీటిని తోడుతున్న దృశ్యం


ఆగడాలలంక చెరువులోని కలుషిత నీటిని వదిలి ఆరబెట్టిన దృశ్యం

అడుగంటిన మంచినీటి చెరువులు

భీమడోలు: కొల్లేరు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. దీనితో కొల్లేరు వాసులు గుక్కెడు మంచినీటి కోసం అల్లాడుతున్నారు. ఎండలు ముదురుతుండడం, చెరుల్లో నీరు లేకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి కాలువకు నీరు విడుదల తక్కువగా ఉండడంతో సంబంధిత అధికారులు వరి సాగుకు ప్రాధాన్యత ఇవ్వడంతో కొల్లేరు గ్రామాల్లోని మంచినీటి చెరువుల్లో నీరు లేక అడుగంటాయి. ఆగడాలలంక ఛానల్ ద్వారా వడ్డిగూడెం, లక్ష్మీపురం, ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల్లోని చెరువులను నీటితో నింపుతారు. కొల్లేరు గ్రామాల ఏరియాలో ఆక్వా చెరువులు తప్ప, వరి సాగు లేకపోవడంతో నీటిని విడుదల చేయడం లేదు. దీనితో గ్రామాల్లోని తక్కువ విస్తీర్ణం గల చెరువులు అడుగంటి దుర్వాసన కొడుతున్నాయి. వరి సాగులో కీలక దశలో ఉండడం, వంతుల విధానం అమలు చేయడంతో ఆ ఛానల్‌కు మంచినీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయడాన్ని గాలికి వదిలేసారు. దీనితో పాటు చెరువుల్లోని నీరు తగ్గగానే సంబంధిత పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు లిఖితపూర్వకంగా జలవనరుల శాఖకు తెలియజేయాల్సి ఉంది. అయితే మూడు శాఖల సమన్వయం కొరవడంతో చెరువులు అడుగంటాయి. దీనితో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తాయి. ఆగడాలలంకలో కొన్ని రోజుల కితమే చెరువును ఎండగట్టారు. వేసవి రోజుల్లో చెరువుల్లో నీటిని నింపుకోవాల్సి ఉండగా నిర్లక్ష్యం వహిస్తుండడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు, పెద్దల ద్వారా సమాచారం అందుకున్న జలవనరుల శాఖ అధికారులు మోటార్లు ఏర్పాటు చేసి ఆగడాలలంక చెరువుకు నీటిని తోడుతున్నారు. నీరు ఆక్వా చెరువులకు వెళ్లకుండా తగు చర్యలు చేపట్టారు. ప్రాధాన్యత క్రమంలో కొల్లేరులోని అన్ని చెరువులకు నీటిని అందిస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

జూట్ ఉత్పత్తుల వినియోగంతో మేలు

ఏలూరు (టూటౌన్): పర్యావరణ పరిరక్షణకు జూట్ బ్యాగులు, ఉత్పత్తుల వినియోగం మేలని ఏలూరు సోషల్ సర్వీస్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ తాతపూడి ఇమ్మానియేల్ అన్నారు. స్థానిక లంకపేట సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసిన జూట్ బ్యాగ్‌ల డిస్ప్లేని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్ వల్ల 21 రకాల క్యాన్సర్ వ్యాధులు వస్తున్నాయని, జూట్, పేపర్ క్లాత్ బ్యాగులను వాడాలని సూచించారు. సొసైటీ ఎండీ పెరికే దీన గ్లాడి మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు పెరికె వర ప్రసాదరావు మాట్లాడుతూ మహిళలు అందుబాటులో ఉన్న బ్యాంకు రుణాలు తీసుకొని చిన్న చిన్న యూనిట్లు స్థాపించుకోవాలని సూచించారు. నిడదవోలు నుంచి పాతపూడి బాలస్వామి సోషల్ వర్కర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి


విజయరాయిలోని ఐసీడీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద

పెదవేగి : చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి శారద అన్నారు. పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పెదవేగి మండలం విజయరాయిలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు నిర్మూలించాలనే సందేశంతో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఏలూరు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి శారద పాల్గొని మాట్లాడుతూ సమాజంలో బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే నష్టాలను వివరించారు. గ్రామాల్లో తల్లిదండ్రులకు బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలని ఆమె తెలియజేశారు. కిశోర బాలికలకు రుతుస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, ఆరోగ్య సంక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం కిశోర బాలిక దశ నుంచే ఆరోగ్యం, పోషకాహారంపై శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ప్రాజెక్ట్ అదనపు సీడీపీఓ సునీల్ రాజశేఖర్, జిల్లా కార్యాలయపు విస్తరణాధికారి మల్లిక, పర్యవేక్షకులు మేరీ బాయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరీ బాలికలు పాల్గొన్నారు.

ముమ్మరంగా మాసూళ్లు.. కానరాని కొనుగోళ్లు

- మార్కెట్‌లో రైతులకు లభించని గిట్టుబాటు ధర
- సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గించిన వ్యాపారులు
- మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలంటున్న కౌలు రైతులు


పెదపాడు మండలంలోని పొలంలో కుప్పగా వేసిన అపరాల పంట

దెందులూరు నియోజకవర్గంలో అపరాల సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
పెదపాడు	5,600
దెందులూరు	1,200
పెదవేగి	500
మొత్తం	7,300

పెదపాడు : మినుము, పెసర పంట మాసూళ్లు దెందులూరు నియోజవర్గ వ్యాప్తంగా రైతులు ముమ్మరంగా చేపట్టారు. అపరాల పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పాటు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల కారణంగా అరకొరగా పండిన పెసర, మినుముకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఎవరికి విక్రయించుకోవాలో తెలియక రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదే అదునుగా దళారులు సిండికేట్‌గా ఏర్పడి పంట ఉత్పత్తులను తక్కువ ధరకు కొనుగోలు చూస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో సుమారు 7,300 హెక్టార్లలో పెసర, మినుము పంటలను రైతులు సాగు చేసారు.

మద్దతు ధరలు పెంచాలి

ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో రైతులకు వరి సాగు కొంతమేర ఆశాజనకంగాఉన్నా పెట్టుబడులు పెరిగిపోయాయి. పంట ఉత్పత్తుల కొనుగోలుకు మార్క్‌ఫెడ్ అధికారులు ఇప్పటి వరకూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. గతేడాది మినుము క్వింటాల్‌కు రూ.9,000, పెసర రూ.8,300 ధరకు కొనుగోలు చేసారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో మినుము రూ.7,600, పెసర రూ.7,300 ధర పలుకుతోంది. ఇదిలాఉండగా ప్రభుత్వం మాత్రం మినుముకు రూ.7,400, పెసరకు రూ.8,682 మద్దతు ధర ప్రకటించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పెసలు ఎవరూ కొనుగోలు చేయడంలేదు. మినుము, పెసలుకు గతేడాది కొనుగోలు చేసిన ధరలు వచ్చేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని అపరాలు సాగు చేసిన కౌలు రైతులు కోరుతున్నారు.

కౌలు రైతులకు ప్రధాన ఆదాయ వనరు

వరి సాగులో కౌలు పోను మిగిలిన ధాన్యం వ్యవసాయ ఖర్చులకు కూడా రాని పరిస్థితి నెలకొంది. పెరిగిన కూలి రేట్లు, ఎరువులు, పురుగు మందుల ధరలు అధికంగా పెరగడంతో కౌలు రైతులకు వరిసాగు భారంగా మారింది. కౌలు రైతులు అపరాల పంటపై ఎంతో కొంత ఆదాయం వస్తుందనే ఆశతో సాగు చేస్తున్నారు. పంట ఉత్పత్తులు ఆశించిన స్థాయిలో లేకపోగా, గిట్టుబాటు ధర అందక కౌలు రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి దాపురించింది. రైతులు అపరాల మాసూళ్లు ముమ్మరంగా చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పా టు చేయకపోవడం కొంతమంది రైతులు పంటలను కుప్పలుగా పోగు చేసి ఉంచారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం వెంటనే అపరాల కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి. లేకుంటే బస్తాకు రూ.2వేలు నష్టపోయే ప్రమాదముంది. ప్రభుత్వం నామమాత్రంగా గిట్టుబాటు ధర ఇచ్చినా ప్రయోజనం ఉండదు.

– ఈ డేవిడ్ రాజు, కౌలు రైతు, ఎల్ఆర్ గూడెం

గిట్టుబాటు ధర రానీయడం లేదు



కౌలు రైతులకు ముఖ్య ఆధారమైన మినుము, పెసర పంటలకు గతేడాది రైతులకు ఇచ్చిన మద్దతు ధర కంటే ఎక్కువ ఇచ్చి కొనుగోలు చేయాలి. దళారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులకు గిట్టుబాటు ధర రానీయడం లేదు.

– కె.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

విలీన సభను విజయవంతం చేయాలి

బుట్టాయగూడెం: ఈ నెల 8న ఒంగోలులో నిర్వహించే ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) విలీన సభ, మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షురాలు వెట్టి భారతి కోరారు. మండలంలోని బూరుగువాడ, పందిరిమామిడిగూడెం, వేపులపాడు గ్రామాల్లో సోమవారం విలీన, మహిళా దినోత్సవ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భారీ ఎత్తున మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకురాళ్లు పాల్గొన్నారు.